

# ఒక పల్లవి మూడు రాగాలు

‘‘సెత్... నీ యవ్వ... ఇంకా ఏందే నువ్వు సెప్పేది?’’

క్రరెత్తి మీదికి రాబోతున్న భర్తను చూసి... భయంగా ఓ అడుగు వెనక్కేసి అంది సీతాలు.

‘‘నిజం మావా... నే సెప్పేది నిజం... నేనే పాపమూ ఎరగను... నీమీదొట్టు...’’

రెండు చేతులూ నడ్డిమీద పెట్టుకుని వింతగా భార్యను చూస్తూ ‘‘ఎట్టెట్టా... నువ్వే పాపమూ ఎరగవా? నా మీదొట్టా... నీ యవ్వ నా కళ్ళతో నేను చూసిన దాన్నే నువ్వు కాదంటావ్... ఆ ఈరిగాడితో కలిసి మాపిటేల నువ్వు తాటి తోపులో కెళ్ళటం నేను సూడలేదనుకుంటు న్నావా? అంతెదవలా కనిపిస్తున్నానే నీకు... పైగా నా మీద ఒట్టేస్తావ్ పింజారిముండా’’ ఆవేశంగా అన్నాడు కొటేశు.

సీతాలు మాట్లాడలేదు.

వెక్కి వెక్కి ఏడుస్తోంది.

‘‘సెప్పవే... మాట్లాడవేం... నీ రంకు బయటపడిందని ఏడుస్తున్నావా? సెప్పవే నీ యవ్వ?’’

కొటేశు చేతిలో క్రర సీతాలు శరీరం మీద నాట్యం చేయసాగింది. సీతాలు పెద్దగా అరుస్తూ శోకాలు పెట్టసాగింది. ఆమె ఏడుపు విన్నకొద్దీ కొటేశు రెచ్చిపోసాగాడు... ఉన్మాదిలా భార్యను కొట్టసాగాడు.

‘‘ఓలమ్మో... ఓలమ్మో... ఏందిరా... మళ్ళీ ఏమైందిరా దొంగనాయలా’’ గుండెలు బాదుకుంటూ ప్రవేశించింది పక్క గుడిసెలో ఉంటున్న రత్తాలు...

‘‘ఏమైందా... ఏమైందో నీ కూతుర్ని అడగవే’’ రోషంగా అన్నాడు కోటేశు.

‘‘అమ్మా—’’

అంటూ తల్లిని కౌగలించుకుని బావురుమంది సీతాలు...

‘‘ఏమైందే... ఏమైందే నా తల్లి... ఏందే ఈ గోరం’’ కూతురు శరీరం మీద తేలిన వాతల్ని చూస్తూ ఏడుస్తూ అంది రత్తాలు.

‘‘సెప్పవే నీయవ్వ... సెప్పు’’ కోపంగా అరిచాడు కోటేశు.

‘‘ఏమైందిరా ఎదవనాయాల... నువ్వు సెప్ప రాదూ’’

విసురుగా క్రరను మూలకు విసిరి... కోపంగా అక్కను చూస్తూ అన్నాడు కోటేశు—

‘‘ఏమైందా... ఈ దొంగనంజ నేను మాపిటేల పొలం నుండి వస్తుంటే... ఆ ఈరిగాడితో కలిసి తాటితోపులోకెళ్ళటం... నా కళ్ళతో నేను సూసానే —ఇంకేం చెప్పమంటావ్?’’

రత్తాలు మాట్లాడలేదు...కూతుర్ని చూసింది.

తలదించుకుని... నిశ్శబ్దంగా రోదిస్తున్న కూతుర్ని చూసి...

‘‘ఏమే సీతాలు... ఆడు సెప్పింది నిజవేనా?’’ అంది.

‘‘నీయవ్వ... దాన్నడుగుతావ్... అంటే... నే సెప్పింది... సూసిందీ అంతా రాంగనా నీ ఉద్దేశం?’’ రోషంగా అరిచాడు కోటేశు.

‘‘నువ్వాగరా నాయాలా... ఏమే... సెప్పు... ఆడు సెప్పింది నిజవేనా?’’ కూతురు తల పైకెత్తి అడిగింది రత్తాలు.

అంతే...

మొదలు నరికిన చెట్టులా తల్లిపాదాల మీద పడి ఏడుస్తూ...

‘‘నన్ను సెమించమ్మా... బుద్ధి గడ్డితిని అట్టాటి ఎదవ పనిసేశాను... ఇంకెప్పుడూ సేయనే... నీ మీదొట్టే...’’ అంది.

చల్లా సుబ్రహ్మణ్యం

విసురుగా సీతాలు జుట్టుపట్టుకుని లేపి...

కోటేశు కాళ్ళమీద విసిరేసి అంది రత్తాలు.

"ఎదవనంజని... ఎదవనంజ... నా కడుపున పెడపుట్టావ్ కదే... నాక్కాదే సెప్పాల్సింది... నీ మొగుణ్ణే అడుగు సెమించమని... థూ..."

"అక్కా... నేనెట్టాటి ఎదవని కాదే... నాయాల్ది... రంకునేర్చిన ఆడదానితో కాపురం కంటే... సెరువులో దూకి సావటం మేలు. నేన్నీ కూతుర్ని ఏలుకోనంటే ఏలుకోనంతే" కోపంగా అన్నాడు కోటేశు.

నెమ్మదిగా కోటేశు దగ్గరకెళ్ళి అతని భుజం మీద చెయ్యేసి...

"తమ్ముడూ... నువ్వే అట్టా అంటే దాని బతుకేమైద్దో ఆలోసించరా" అంది.

"అంటే... నాయాల్ది... నా బతుకేమవుద్దో ఆలోసించవేం?" ఆవేశంగా అన్నాడు కోటేశు.

"అందుకేరా... అదెవరో కాదు నా కూతురు ... నేనెవర్నో కాదు... నీ రక్తం పంచుకుపుట్టిన నీ అక్కను... మనింటి గుట్టు మనమే రట్టు సేసుకుంటే రేపు తలెత్తుకుని ఎట్టా బతుకుతాం సెప్పు. నా మాట వినరా... ఈసారి అట్టాటి ఎదవ పని సేసినట్టు తెలిసిందో... నువ్వే కాదురా... నేనే దీన్ని నరికి పోగులు పెడతాను... సరేనా?" అంది రత్తాలు.

"సేయనమ్మా... ఇంకెప్పుడూ సేయనే... మావా... నన్ను సెమించు మావ. దేవుడు లాంటి నిన్ను బాధపెట్టాను."

కాళ్ళుపట్టుకుని ఏడుస్తున్న భార్యను చూసి రోషంగా అన్నాడు కోటేశు.

"ఊ... సర్లే... లే... లే కాస్త కూడొండు... ఆకలి మండిపోతోంది."

★ ★ ★

"ఏనండీ"

బాధగా అంది సులోచన.

"అవును సులోచన... జరిగిందేవిటో కళ్ళారా నేను చూశాను... కాదనే ధైర్యం నీకు లేదు... చెప్పు ఎందుకలా చేశావ్?" అన్నాడు రాజారావు.

సులోచన మాట్లాడలేదు... తలదించుకొని ఏడుస్తోంది?

నెమ్మదిగా ఆమె దగ్గరకెళ్ళి ఆమె చేయిపట్టుకుని.

"చెప్పు సులోచనా నేను నీకేం తక్కువ చేయలేదు... చేస్తున్నది గుమస్తా ఉద్యోగమైనా నాకున్నంతలో నిన్ను తృప్తి పరచాలని ప్రయత్నించాను. అలాంటిది నువ్వు ఆ ఎదురింటి వాడితో ఛ...ఛ..." అసహ్యంతో తల విదిల్చాడు రాజారావు.

"నన్ను క్షమించండి... ప్లీజ్... ఏ దరిద్ర దేవతో నన్ను ఆవహించి, నా చేత అలాంటి నీచమైన పని చేయించింది. ఇంకెప్పుడూ అలా చేయను. నన్ను క్షమించండి... నా జీవితాన్ని నాశనం చేయకండి" అతని పాదాల మీద పడి ఏడుస్తూ అంది సులోచన

రాజారావు చలించలేదు.

"నీ జీవితాన్ని నాశనం చేస్తుంది నేను కాదు... నువ్వే... నీ చేతులారా నాశనం చేసుకున్నావ్... చేతులు కాలాయి సులోచనా... ఇప్పుడు బాధపడి ఉపయోగం లేదు... ఐ యాం సారీ" అన్నాడు.

తలెత్తి భయంగా భర్తను చూస్తూ అంది సులోచన.

"అంటే... అంటే... మీ ఉద్దేశం?"

అతను విసురుగా బయటకెళ్ళబోయి తలుపు దగ్గర ఆగి, వెనక్కు తిరిగి ఆమెను చూస్తూ అన్నాడు.—

"ఈ రోజే విడాకుల కోసం నోటీసు పంపిస్తాను... సంతకం చేసి పంపించు జీవితంలో ఇంకెప్పుడూ నీ ముఖం నాకు చూపించకు... గుడ్... బై."

★ ★ ★

"సో... వాట్?"

నిర్లక్ష్యంగా సోఫాలో కూర్చుని కాళ్ళూపుతూ అంటున్న భార్యను చూసి ఆశ్చర్యపోయాడు ప్రసన్నకుమార్.

"సిగ్గులేదూ... చేసింది చాలక... అలా ధైర్యంగా మొగుడితో మాట్లాడటానికి—" కోపంగా అన్నాడతను.

పెద్దగా నవ్వింది దేవికారాణి.

"సీ మిస్టర్ ప్రసన్నకుమార్... నేను కుమార్ వర్మతో కాంటాక్ట్స్ పెట్టుకున్నానని అలా రోషపడిపోతున్నావ్... మరి నీ కాంటాక్ట్స్ విషయం ఏవిటో ఆలోచించావా? ఆగు... మగాణ్ణి అని తప్పించుకోకు... మనకున్న రెండు కోట్ల ఆస్తిలో ఓ కోటి నీదైతే... మరొకటి నాది. ఇందులో ఎవరూ ఎవరికి బానిసలా పడుండాల్సిన అవసరం లేదు. నీ విలాసాలు— నీ సుఖం నీకెంత ముఖ్యమో, నాకూ నావి అంతే ముఖ్యం. సో... నోమోర్ ఆర్గ్యుమెంట్స్... చెప్పు ఇలా రాజీపడి బ్రతుకు దామా? లేక డైవర్సు తీసుకొని విడిపోదామా... ఆలోచించుకో" అంది.

ఉలిక్కిపడ్డాడు ప్రసన్నకుమార్.

డైవర్స్...


నగరంలో కెల్లా ప్రముఖమైన వ్యక్తిగా... సమాజంలో కీర్తి ప్రతిష్ఠలున్న తన పెళ్ళాం, ఎవడితోనో తిరుగుతోందన్న అనుమానంతో విడాకులు తీసుకుంటే— రేపు తలెత్తుకుని ఎలా తిరగ్గలడు?

తన ప్రెస్టీజ్... ఇమేజ్... ఇవన్నీ ఏమైపోతాయి?

తనను ఇదివరకులా ఎవరు గౌరవిస్తారు?

తల విదిలించాడు ప్రసన్నకుమార్.

అతని ఫీలింగ్స్ గమనిస్తున్న దేవికారాణి సోఫాలోంచి లేచి నిలబడి భర్త పెదవులు ముద్దాడి అంది.





### చెప్పింది చేద్దాం

[illegible]

"సో... నో డైవర్స్ ఒకే? బి హేపీ మై డాలింగ్... లెటజ్ ఎంజాయ్ ద లైఫ్..."

★ ★ ★

"ఏవిటి మిస్టర్ రాజారావ్... వారం రోజులు శెలవెందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు ప్రసన్నకుమార్.

తలదించుకున్నాడు రాజారావు.

అతనికెలా చెప్పాలో అర్థం కాలేదు. ప్రసన్నకుమార్ ఓ యజమానిలా కాకుండా ఆప్తుడిగా తనతో ప్రవర్తిస్తాడు... అలాంటి ఆయనకు అబద్ధం చెప్పటం భావ్యం కాదనిపించింది. బెరుగ్గా గుమ్మంలో నిలుచున్న కోటేశును చూశాడు రాజారావు. పీతాల్తో... ఆ వూరొదిలి... నగరానికొచ్చి... ప్రసన్నకుమార్ ఫ్యాక్టరీలో అటెండర్‌గా చేరాడు కోటేశు.

"ఫర్వాలేదు చెప్పు రాజారావ్... ఎనీథింగ్ రాంగ్?" అన్నాడు ప్రసన్నకుమార్.

"నేను మా ఆవిడకు డైవర్స్ ఇస్తున్నాను సర్... ఐ మీన్ హర్ కేరక్టర్... అదే... అంచేత..."

తలదించుకుని చెబుతున్న రాజారావుని చూసి ... ఏదో అర్థమైన వాడిలా నవ్వుతూ కోటేశును చూశాడు ప్రసన్నకుమార్. సరిగ్గా అప్పుడే కోటేశు ప్రసన్నకుమార్‌ను చూసి నవ్వాడు. ఇద్దరి నవ్వుల కర్థం తెలీక అయోమయంతో చూశాడు రాజారావు.

మధ్య తరగతి మిథ్యా విలువల్లో బ్రతుకుతున్న అతనికి— వారి నవ్వుల కర్థం......

అర్థం కాలేదు!!

# దీపావళి కార్టూన్లు

